మొగిలిలో దొంగలు పడ్డారు!

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. ఓ దుకాణ యజమాని ఇంటి ముందు ఆపి ఉంచిన బుల్లెట్‌ను అపహరించారు. జాతీయ రహదారిని పక్కనే ఉన్న మొగిలిలో మంగళవారం తెల్లవారు జామున ఐదుగురు గుర్తు తెలియని దొంగలు ముసుగులు ధరించి, చేతుల్లో కట్టెలు, బ్యాటరీ ఇళ్లల్లో చోరీ చేసేందుకు వచ్చారు. ఉదయం 2 గంటల సమయంలో మొగిలీశ్వరాలయ అర్చకులు ఉంటున్న వీధిలో దొంగలు వెళ్లడంతో అదే సమయంలో అర్చకుడు దండపాణి గురుకుల్ పూజా కార్యక్రమానికి హాజరయ్యేందుకు సిద్ధమవుతుండడంతో ఇంటి ముందు ఎవరో సంచరిస్తున్న విషయాన్ని గ్రహించారు. వెంటనే దండపాణి గురుకుల్ మొగిలి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మొగిలి గ్రామానికి వెళ్లారు. అప్పటికే దొంగలు మొగిలి గ్రామానికి చెందిన ఆనంద్ అనే ఇంటి ముందు పార్కు చేసిన బుల్లెట్ అపహరించుకుపోయారు. ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో 2.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు రికార్డు


సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగల సంచారం


ఓ ఇంటి కిటికిలోకి లైట్ వేసి చూస్తున్న దొంగ

అయ్యింది. దొంగ ఓ ఇంటి కిటికీలో తార్చిలైట్ వేసి చూస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్యాంక్‌లో చోరీ కోసం వచ్చారా?

ఐదుగురితో కూడిన దొంగల ముఠా సభ్యులు మొగిలి గ్రామంలో సంచరించడం సంచలనంగా మారింది. ముసుగులు ధరించిన దొంగలు బ్యాంక్ చోరీ కోసం వచ్చారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ రహదారి సుమారు 50 అడుగుల దూరంలోనే గ్రామీణ బ్యాంక్ ఉంది. అటుగా వెళ్లారా? లేదా, అని చర్చించుకుంటున్నారు. బ్యాంక్ వద్దకు వెళ్లకుండా గ్రామంలోనే సంచరించారా? అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దొంగల సంచారంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ముసుగుదొంగలు ఎవరై ఉంటారు?

ముసుగులు ధరించిన దొంగల ముఠా ఎవరై ఉంటారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఐదుగురు సభ్యులు సంచరించడం సీసీ కెమెరా పుటేజీల్లో తెలుస్తోంది. వీరు ఎలా వచ్చారు. కారులోనా, లేక ద్విచక్రవాహనాల్లో వచ్చారా? అని అనుమానిస్తున్నారు. వాహనాలను హైవేలో పెట్టి గ్రామంలోకి ప్రవేశించి ఉంటారని తెలుస్తోంది. దొంగలు తమిళనాడు వాసులా, లేక కర్ణాటకకు చెందిన వారా? లేక ఇతర గ్రామాలకు చెందిన వారా? అనే విషయాలు దర్యాప్తులో తేలాల్సింది.

అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలి

గ్రామాల్లో అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. అనుమానితులు, దొంగలు సంచారంపై సమాచారం ఇవ్వాలని సూచించారు. రాత్రి వేళలో ఇళ్లకు తాళాలు వేసుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రంగా పెట్టుకోవాలన్నారు.

నూతన అంబులెన్స్ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం కొనుగోలు చేసిన నూతన అంబులెన్స్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ప్రారంభించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన ప్రభుత్వాస్పత్రిలో పాతబడిన అంబులెన్స్ స్థానంలో కొత్త అంబులెన్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఐటీసీఎల్ సీఎస్ఆర్ సహాయంతో త్వరలో ఒక కొత్త అంబులెన్స్‌ను కొనుగోలు చేయబోతున్నట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వాస్పత్రిలో 4 అంబులెన్స్‌లు ఉంటాయన్నారు. అత్యవసర వైద్య సేవలను అందించేందుకు వేలూరు, తిరుపతికి రోగులను తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌లను వినియోగించనున్నట్లు తెలిపారు.


నూతన అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

క్లుప్తంగా

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చిత్తూరు లీగల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి యత్నాన్ని నిరసిస్తూ మంగళవారం చిత్తూరులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. దేశ సర్వోన్నత న్యాయస్థాన పీఠంపై కూర్చున్న వ్యక్తిపై ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడాన్ని ఖండిస్తున్నట్లు చిత్తూరు న్యాయవాదుల సంఘం పేర్కొంది. ఇక చిత్తూరులోని ఓ మహిళా న్యాయవాదిపై ఇటీవల జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ పేర్కొంది.

ఎస్పీతో శిక్షణ ఐఏఎస్ అధికారి భేటీ


ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ట్రైనీ కలెక్టర్

చిత్తూరు అర్బన్: ఎస్పీ తుషార్ డూడీని ఇక్కడ శిక్షణ పొందుతున్న ఐఏఎస్ అధికారి నరేంద్ర పాడేల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. పోలీస్ స్టేషన్ల నిర్వహణ, పనితీరు, చట్టాలపై కూడా నరేంద్ర పాడేల్ తెలుసుకోనున్నారు.

స్వదేశీ ముద్దు..విదేశీ వద్దు


మాట్లాడుతున్న చిట్టిబాబు

గుడిపాల: స్వదేశీ ముద్దు, విదేశీ వద్దని విద్యావేత్త, బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు అన్నారు. మంగళవారం సీఎన్ఆర్ కళాశాలలో ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ వస్తువులు వినియోగం, జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ లోకేష్ రెడ్డి, ప్రిన్సిపల్ రామచంద్ర, అధ్యాపకులు అర్జున్, రంజిత్, మీనాకుమారి, గాయత్రిలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


జ్యోతికుమార్ (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని సంక్రాంతిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ జ్యోతికుమార్(62) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారమందుకున్న పలువురు ప్రజాప్రతినిధులు మాజీ సర్పంచ్ జ్యోతికుమార్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేశారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను కట్టడి చేయాలన్నారు. మానవ మృగాలకు తీవ్రమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ద్వితీయ బహుమతి స్వీకరిస్తున్న చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొన్న బాలికల జట్టు ప్రతిభ చాటి రజిత మెడల్ సాధించింది. అనకాపల్లి జిల్లా వెలుగొండ మండలం కృష్ణదేవిపేట హైస్కూల్‌లో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా తరపున పాల్గొన్న అండర్-14 బాలికల జట్టు క్రీడాకారులు విజయనగరం జిల్లా జట్టుపై హోరాహోరీగా తలబడ్డారు. ఈ పోటీల్లో స్వల్ప స్కోరు తేడాతో చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ద్వితీయస్థానంలో నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులు అతిథులు చేతులు మీదుగా సిల్వర్ మెడల్‌ను స్వీకరించారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు చందు, పీడీ దేవా తదితరులు పాల్గొన్నారు.

పూజిగానిపల్లెలో అథ్లెటిక్స్ పోటీలు


పుంగనూరు: అథ్లెటిక్స్‌లో విజేతలుగా నిలిచిన వారితో ఉపాధ్యాయులు

పుంగనూరు: మండలంలోని పూజిగానిపల్లె ఉన్నత పాఠశాలలో మంగళవార మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలను హెచ్ఎం బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. పూజిగానిపల్లె, గూడూరుపల్లె, చంద్రమాకులపల్లె పాఠశాలల నుంచి క్రీడాకారులు వివిధ పోటీలలో పాల్గొన్నారు. బాలుర విభాగంలో దేవేంద్ర, లక్ష్మీలోచన్, జలాల్,లతీఫ్, బాలికల విభాగంలో జ్యోత్స్న, గానవి, కన్నమ, పూజ, కళావతి చాంపియన్లుగా నిలిచారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు సదుంలో జరగనున్న డివిజనల్ పోటీల్లో పాల్గొంటారని మండల కో-ఆర్డినేటర్ జయక్రిష్ణ తెలిపారు. పోటీలను ఫిజికల్ డైరెక్టర్లు ఉమ, రెడ్డిరాధ, తులసీరాం, మురళీధర్, జ్యోతి, సుమ నిర్వహించారు.

అన్నింటా రాణించండి

చౌడేపల్లె: విద్యార్థులు అన్నింటా రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.దామోదరరాజు అన్నారు. మంగళవారం అమరక్రిష్ణాపురం సమీపంలోని చెరువులో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలన్నారు. క్రీడల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణకు తనవంతు సహకారం ఆయన అందజేశారు. అనంతరం జూనియర్, సీనియర్స్ బాలురు, బాలికల విభాగాల్లో పరుగు పందెం, త్రోస్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ పోటీలను నిర్వహించారు. విజేతలకు జెడ్పీటీసీ సభ్యుడు, పుదిపట్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మజ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు వెంకటేష్, రాజేంద్ర, వంశీ, భవాని,నాగమునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు వైద్యం


చెర్లోపల్లెలో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతోనే పేదలకు ఇంటింటికీ వైద్యం అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మండలంలోని కె.పట్నం, చెర్లోపల్లె గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎవరికైనా జ్వరాలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

గరుడుడిపై వరదుడు


గరుడవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం: పున్నమిని పురస్కరించుకుని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత వరదరాజుల స్వామివారు మంగళవారం గరుడవాహనంపై విహరించారు. తొలుత మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేశారు. రాత్రి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఊరేగుతున్న స్వామికి భక్తులు కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

వాల్మీకి మహర్షికి పోలీసుశాఖ నివాళి


నివాళులర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్: వాల్మీకి మహర్షికి చిత్తూరు పోలీసుశాఖ నివాళులర్పించింది. మంగళవారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడీ నివాళులర్పించారు. రామాయణం ద్వారా నీతి, ధర్మం, సత్యం బోధించారన్నారు.


నివాళులు అర్పిస్తున్న అధికారులు

యాదమరిలో..

యాదమరి: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఎంపీడీఓ పెంచల వీరేంద్ర ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. డిప్యూటీ ఎంపీడీఓ రామరాజు రామచంద్ర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ‘యక్షప్రశ్నలు’

చిత్తూరు రూరల్: నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో చైతన్య సాహితీ, చిత్తూరు హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో ఆంధ్ర మహాభారతంలోని యక్షప్రశ్నలు కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి యక్షప్రశ్నలపై చేసిన ప్రసంగం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన ఉపన్యసిస్తూ పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో ధర్మరాజు ధర్మనిష్ఠను పరీక్షించడానికి యముడు యక్షునిగా వచ్చి కొన్ని ప్రశ్నలను అడిగారన్నారు. ధర్మంపై యక్షుని ప్రశ్నలకు ధర్మజుడు ఇచ్చిన సమాధానాలకు యక్షుడు సంతృప్తి చెంది, పాండవులు నలుగురు సోదరులకు ప్రాణదానం చేశారని చెప్పారు. ధర్మరాజుని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తత్వ, ఆత్మ జ్ఞానాలు యక్షప్రశ్నలలో నిగుడీకృతమైందని అన్నారు. నేటి కాలంలో మానవుడు తమ నిగ్రహాన్ని కోల్పోయి మృగంగా మారుతున్నాడని, చివరికి తనను తానే మోసం చేసుకుంటున్నాడని అన్నారు. సంసార జీవితంలో ఏర్పడే కష్టాలను తట్టుకుని నిలబడాలంటే మనోనిగ్రహం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజారత్నం రెడ్డి,సభ్యులు రాధాకృష్ణరెడ్డి, నాగిరెడ్డి,భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉపన్యసిస్తున్న శతావధాని మురళి

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కాణిపాకం ఆలయ ఈఓ పెంచలకిషోర్ సిబ్బందిని ఆదేశించారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పారిశుద్ధ్యం పరిశీలించారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్లు, స్నానపు ఘట్టాలు తదితర ప్రాంతాలను సందర్శించారు. అయ్యప్ప భక్తులకు కావాల్సిన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈఓ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.


కాణిపాకంలో తనిఖీ చేస్తున్న ఈఓ పెంచల కిషోర్

శరవేగంగా నేషనల్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు

- ఇప్పటికే హోస్కోట నుంచి బేతమంగళం వరకు రాకపోకలు
- ఏపీలోని రెండో ఫేజ్‌లోనూ మొగిలి వరకు రోడ్డు
- ఫేజ్-3 తమిళనాడులోనూ దాదాపుగా పూర్తయిన రోడ్డు
- 2026 కల్లా రాకపోకలకు రెడీ


ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా ఫేజ్-2లో రెండో ప్యాకేజీ పలమనేరు-గుడిపాల మధ్య సాగుతున్న పనులు

పలమనేరు: దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలలో భాగంగా చెన్నై-బెంగళూరు ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే(ఎన్ఈ-7) పనులు శరవేగంగా సాగుతున్నాయి. కర్ణాటకలో బెంగళూరు సమీపంలోని హోస్కోట నుంచి మొదలైన రోడ్డు పనులు మన రాష్ట్ర సరిహద్దులోని వీకోట సమీపంలోని బేతమంగళం వరకూ పూర్తయ్యాయి. ఈ మార్గంలో 75 కి.మీ మేర వాహనాల రాకపోకలు అనధికారికంగా సాగుతున్నాయి. ఫేజ్-2లో భాగంగా ఏపీలో మూడు దశలుండగా, వీకోట నుంచి పలమనేరు వరకు రోడ్డు పనులు 90 శాతం పూర్తి చేశారు. మరోవైపు ఫేజ్-3లో భాగంగా తమిళనాడులోనూ 70శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మొత్తం మీద 2026 కల్లా ఈ రోడ్డు అందుబాటులోకి రానున్నట్టు స్థానిక కాంట్రాక్ట్ కంపెనీ దిలీప్ బిల్డ్ కాన్ నిర్వాహకులు తెలిపారు.

కేవలం రెండే గంటలు!

బెంగళూరు నుంచి చెన్నైకు ఇప్పటిదాకా ఎన్‌హెచ్-4 మీదుగా కోలారు, ముళబాగిల్, పలమనేరు, చిత్తూరు, రాణిపేట మీదుగా 330 కిలోమీటర్లు ప్రయాణించి చెన్నైకి వెళ్తున్నారు. ప్రయాణ సమ యం దాదాపుగా ఏడు గంటలు పడుతోంది. బెంగళూరు నుంచి మరో మార్గంగా ఎన్‌హెచ్-44 మీదు గా క్రిష్ణగిరి, వేలూరు, కాట్పాడి మీదుగా 350 కి.మీ దూరాన్ని ఏడున్నర గంటలు పడుతోంది. దీంతో ప్రయాణ దూరాన్ని తగ్గించేలా నిర్మించిన ఈ మా ర్గంలో 262 కి.మీ కేవలం రెండు గంటల్లో హోస్కో ట నుంచి శ్రీపెరంబూదూర్‌కు చేరుకోవచ్చు.

ఇప్పటికే మొదలైన రాకపోకలు

హోస్కోట నుంచి బేతమంగళం వరకూ ఫేజ్-1లో భాగంగా 75 కిలోమీటర్ల మేర రోడ్డులో వాహనాల రాకపోకలు ఇప్పటికే అనధికారికంగా మొదలయ్యాయి. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల వాహనాలు అక్కడి నుంచి కేవలం అరగంటలో హోస్కోటకు చేరుకుంటున్నాయి.

ఏనుగులకు ఇబ్బంది లేకుండా భారీ టవర్లపై రోడ్డు పనులు

ఏపీలోని రెండో ఫేజ్‌లో మూడు ప్యాకేజీలున్నాయి. తొలి ప్యాకేజీలో వీ.కోట నుంచి పలమనేరు వరకు పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. కౌండిన్య అభయారణ్యంలోని మొగిలిలో ఏనుగుల సంచారం ఉండడంతో ఇక్కడ 11 కిలోమీటర్ల మేర భారీ ఎత్తులో టవర్లు నిర్మించి దానిపై రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి బలిజపల్లె మీదుగా తిరుపతివైపు వెళ్లేలా రోడ్డు కనెక్టివిటీ ఇచ్చారు. ఇక ఫేజ్-3లో భాగంగా తమిళనాడులోని 4 ప్యాకేజీల్లోనూ పనులు 70శాతం పూర్తయ్యాయి. మొత్తం మీద 2026 నాటికల్లా ఈ హైవే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది.


మొగిలి ఘాట్‌లో ఏనుగులకు సమస్య లేకుండా టవర్లపై వెళ్లే రోడ్డు పనులు



వీ.కోట సమీపంలోని బేతమంగళం వద్ద ఇప్పటికే బెంగళూరుకు మొదలైన రాకపోకలు

ఇదీ ఎక్స్‌ప్రెస్ హైవే స్వరూపం

- హోస్కోట నుంచి శ్రీపెరంబూదూర్‌కు ఎక్స్‌ప్రెస్‌హైవే దూరం: 262 కి.మీ
- రోడ్డు ప్రారంభమైంది: మే 2022
- రోడ్డు నిర్మాణ వ్యయం: రూ.18వేల కోట్లు
- మొత్తం మూడు ఫేజ్‌లు, పది ప్యాకేజీలు
- కర్ణాటకలో-3, ఏపీలో-3, తమిళనాడులో-4
- కర్ణాటకలో 75కిమీ, ఏపీలో 89కి.మీ, తమిళనాడులో 98కి.మీ
- స్టాపింగ్ పాయింట్లు: హోస్కోట, మాలూరు, బంగార్‌పేట, బైరెడ్డిపల్లె(జంక్షన్), పలమనేరు, గుడిపాల సీఎంసీ, రాణిపేట, కాంచీపురం, శ్రీపెరంబుదూర్.
- ప్రయాణవేగం గంటకు: 120 నుంచి 180 కిలోమీటర్లు
- మార్గంలో మొత్తం మేజర్ బ్రిడ్జిలు: 9
- మైనర్ బ్రిడ్జిలు: 144
- బెంగళూరు నుంచి చెన్నైకు ప్రయాణ సమయం : 2 గంటలే

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్ : నగరంలో నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ సంతపేట అసిస్టెంట్ ఇంజినీర్ చిరంజీవి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని సంతపేట సెక్షన్‌లో 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్‌లు రోడ్డు విస్తరణ మార్చడం జరుగుతోందన్నారు. దీంతో ఈ నెల 8 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు వెల్లడించిన ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. నగరంలోని బజార్‌వీధి, శేషాపురం, జండామానువీధి, ఓటీకే రోడ్డు, గాంధీరోడ్డు, ఇందిరానగర్, డీఐ రోడ్డు, తోటపాళెం, కైలాసపురం, ఎల్ఐసీ కాలనీలలో విద్యుత్ ఉండదని ఏఈ వెల్లడించారు.

పంటలపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పలు ప్రాంతాల్లో పంటలపై ఏనుగులు దాడి నిత్యకృత్యంగా మారింది. మంగళవారం తెల్లవారు జామున దేవళంపేట మిట్టమీద రాచపల్లె, పెనుబాల దళితవాడకు చెందిన పలువురు రైతుల పంటలను తొక్కి నాశనం చేశాయి. ముఖ్యంగా వరి పంటకు తీవ్ర నష్టం కలిగించాయి. మిట్టమీద రాచపల్లెకు చెందిన భాస్కర్, సిద్దయ్య, నారాయణ సాగు చేసిన వరిపంటను ఏనుగులు తొక్కివేశాయి.అలా కొబ్బరి చెట్లను పెరికి వేశాయి. కోటపల్లెకు చెందిన మురళి మామిడితోటలో కొమ్మలను విరిచేశాయి. ఏనుగుల దాడి పరిపాటిగా మారడంతో రైతులు తమ పంట పొలాల వైపు వెళ్లడానికి జంకుతున్నారు. ఎక్కడ ఏ మూల నుంచి దాడి చేస్తాయోనని హడలిపోతున్నారు. అటవీ అధికారులు పంట నష్టం పరిశీలించడం తప్పితే వాటి కట్టడికి చర్యలు తీసుకోవడం లేదని రైతన్నలు వాపోతున్నారు.